క్లుప్తంగా

పెన్షనర్ల వినతి



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న రిటైర్డు ఉద్యోగులు

నల్లజర్ల: తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డు ఉద్యోగులు నల్లజర్లలో మంగళవారం తహసీల్దారు ఎస్.వి.ఎస్.నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలశాఖ అసోసియేట్ అధ్యక్షుడు యస్.యం.ఆలీ సాహెబ్ మాట్లాడుతూ 2023లోనే పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉందని ఇంతవరకు దానిని ఏర్పాటు చేయలేదన్నారు. వెంటనే పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి, ఐ.ఆర్ ప్రకటించాలని కోరారు. డీఆర్, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని ఆసుపత్రులలో ఈహెచ్ఎస్ కార్డుపై క్యాష్‌లెస్ వైద్యం అందించాలని కోరారు. వి.కామేశ్వరావు, కె.ఏసురత్నం, ఐడీవీ అప్పారావు, ఏవీఎస్ రావు, ప్రసాదరావు, ఖాన్‌బాజీ, యం.యస్.వి ప్రసాదరావు, కే.ఎస్.ప్రకాశరావు, మల్లికార్జునరావు, నరసయ్య పాల్గొన్నారు.

చర్మకార సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్



నియామక పత్రం అందుకుంటున్న రాజేంద్ర ప్రసాద్

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి గ్రామానికి చెందిన చిర్రా రాజేంద్ర ప్రసాద్‌ను చర్మకార సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పాలిమేర హరికృష్ణ నియామక పత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. తన తండ్రి నాగేశ్వరరావు మండలంలో ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణ త్యాగం చేసిన వ్యక్తి అని, ఆయన బాటలో చర్మకారుల కోసం, వారి సంక్షేమం కోసం పనిచేస్తున్న తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్టు రాజేంద్రప్రసాద్ చెప్పారు.

యూనిఫామ్‌ల అందజేత



యూనిఫామ్‌తో విద్యార్థులు

పెరవలి: కానూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఎంపికైన 64 మంది విద్యార్థులకు దాత అనపర్తి సత్యనారాయణ యూనిఫామ్‌లు అందించారు. సర్పంచ్ భావన మధు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజనీ, ఎస్ఎంసీ చైర్మన్ నరమామిడి శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు కోలా సీతయ్యనాయుడు, లాయర్ సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్లకు ఆర్థిక సహాయం

చాగల్లు: రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర -2047 విజన్ సాకారంలో భాగంగా 2029 నాటికి ×అందరికీ ఇల్లు × కార్యక్రమంలో ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75వేల అదనపు సహాయం అందించనున్నట్టు హౌసింగ్ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శేఖర్ బాబు తెలిపారు. మంగళవారం చాగల్లు మండలం పరిధిలో పలువురు లబ్ధిదారులను కలిసి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలో 765 మంది గృహ లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టవలసి ఉందన్నారు. వారికి ప్రభుత్వం అదనంగా అందిస్తున్న సహాయం గురించి అవగాహన కార్యక్రమం చేపట్టామన్నారు. చాగల్లు మండలం పరిధిలో 765 మంది లబ్ధిదారులు ఉండగా ఇప్పటి వరకూ 121 మందికి సమాచారం అందించి, 119 మందిని నేరుగా కలిశామన్నారు. ఇంటి నిర్మాణం కోసం 112 మంది లబ్ధిదారులు ఆసక్తి చూపినట్లు తెలిపారు. మే నెలాఖరు నాటికి ఇంటి నిర్మాణం పూర్తి చేసేలా అవగాహనా కల్పించినట్లు తెలిపారు. 2029 నాటికి 'అందరికీ ఇల్లు' ఏర్పరచాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.

బిల్లు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

కొవ్వూరు: ఏవిధమైన బిల్లుల్లేకుండా అక్రమం ఇసుక తరలిస్తున్న 12 టన్నుల లారీని జిల్లా టాస్క్‌ఫోర్సు పోలీసులు మంగళవారం సీజ్ చేసినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వాహనాలను ఆపి బిల్లులు తనిఖీ చేస్తున్న సమయంలో బంగారమ్మపేట సమీపంలో లారీని ఆపి తనిఖీ చేస్తుండగా బిల్లు లేకుండా రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అనంతరం వాడపల్లి ఇసుక ర్యాంపులో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్సు ఎస్సై ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. లారీని సీజ్ చేసి స్టేషన్‌కి తరలించి తదుపరి చర్యల కోసం మైనింగ్ అధికారులకు సమాచారం అందించామన్నారు.

అదనపు లోడు దించుకోండిలా..

- విద్యుత్ వినియోగదారులకు సదవకాశం
- దాదాపు సగం రాయితీ కల్పించిన విద్యుత్ శాఖ
- నాలుగేళ్లకోసారి ఈ చాన్స్



నిడదవోలు: గృహ విద్యుత్తు వినియోగదారులు తమ సర్వీసుపై వాడుతున్న అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవడానికి ఏపీఈపీడీసీఎల్ మంచి అవకాశం కల్పించింది. ఈ అవకాశం మార్చి ఒకటో తేదీ నుంచి జూన్ 30 వరకు మాత్రమే కొనసాగుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. పూర్వం గృహ విద్యుత్ కనెక్షన్ ఉన్న ఇంటిలో ఎక్కువగా ఒక బల్బు, ఒక ఫ్యాన్ వినియోగంలో ఉండేవి. ప్రస్తుతం విద్యుత్ పరికరాల వినియోగం పెరిగిపోవడంతో వాడకం ఎక్కువైంది. గత పది సంవత్సరాలతో పోల్చితే విద్యుత్ వాడకం ఇప్పుడు మూడింతలు పెరిగిందని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల నాణ్యమైన విద్యుత్ అందుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫ్యాను స్థానంలో ఏసీలు పెరిగిపోయాయి. వేడి నీటికి హీటర్లు, దుస్తులు ఉతికేందుకు వాషింగ్ మెషీన్లు, పిండి రుబ్బడానికి గ్రైండర్లు, ఎల్ఈడీ టీవీల వాడకం ఎక్కువైంది. అంతేకాకుండా కార్లు, మోటార్ సైకిళ్లకు సైతం చార్జింగ్ చేసుకుంటున్నారు. దీంతో విద్యుత్ వాడకం రోజురోజుకి పెరుగుతోంది. వేసవిలో విద్యుత్ వినియోగం కూడా పెరుగుతుంది. సాధారణంగా ప్రతి ఇంట్లో వినియోగం పెరుగుతూ వస్తోంది.

గృహ విద్యుత్ మీటర్ల వివరాలు

నిడదవోలు మండలం	37,184
పెరవలి మండలం	22,547
ఉండ్రాజవరం మండలం	26,200
కొవ్వూరు మండలం	26,365
దేవరపల్లి మండలం	23,390
గోపాలపురం మండలం	18,787
నల్లజర్ల మండలం	25,983
తాళ్లపూడి మండలం	15,827
మొత్తం	1,49,315

క్రమబద్ధీకరణకు ఇచ్చే రాయితీలు ఇలా (రూ.లలో)..

అదనపులోడు (కిలోవాట్)	అసలు ధర	తగ్గింపు ధర
01	2,250	1,250
02	4,400	2,400
03	6,650	3,650
04	8,850	4,850

లోవోల్టేజీ సమస్యలు దూరం

ఈ క్రమంలో గృహ అవసరాలకు వినిమోగించే విద్యుత్తును క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు దాదాపు 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. గృహ విద్యుత్ అవసరాలకు కనెక్షన్ ఇచ్చే సమయంలో వాడే లైట్లు, గృహోపకరణాల అవసరాల మేరకు కిలోవాట్ల లెక్కన డెవలప్‌మెంట్ చార్జీ, సెక్యూరిటీ డిపాజిట్ కట్టించుకునేవారు. దానికంటే ఎక్కువ వినియోగదారుల వాడకం పెరిగింది. అధికంగా విద్యుత్ పరికరాలు వాడడం వల్ల తక్కువ లోడు కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ ట్రిప్ అయి లోవోల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. వినియోగదారులు కూడా తరచూ ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అధికారులు విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ సంస్థ వినియోగదారులకు క్రమబద్ధీకరించుకొనే అవకాశాన్ని కల్పిస్తోంది.

50 శాతం రాయితీ ఇస్తున్నాం



విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. లోడు క్రమబద్ధీకరణ చేసుకోవడం మంచిది. వినియోగదారులకు అన్ని విధాలా మేలు కలుగుతుంది. జూన్ 30వ తేదీ వరకు ఈ అవకాశం ఉంది. తద్వారా లోవోల్టేజీ సమస్య నుంచి విముక్తి పొందొచ్చు. ఇప్పటికే విద్యుత్ అవసరాల మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం.

– ఎస్. నారాయణ అప్పారావు, విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏపీఈపీడీసీఎల్, నిడదవోలు

అధినేతతో భేటీ



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

నిడదవోలు : తాడేపల్లి వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మంగళవారం నిడదవోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పలు రాజకీయ అంశాలను మాజీ సీఎం జగన్‌తో ఆయన చర్చించారు.

నేడు రేషన్‌షాపు డీలర్లకు సమావేశం

ఉండ్రాజవరం: జిల్లా పౌర సర ఫరాల అధికారి ఆదేశాల మేరకు మండలంలోని రేషన్‌షాపు డీలర్లకు ఉండ్రాజవరం గ్రామంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు సివిల్ సప్లై డీటీ సుధీర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలో 6,412 రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ చేయని కారణంగా ఈ సమావేశంలో ఈకేవైసీ చేసే విధానం తెలియజేస్తారన్నారు. ఈ సమావేశానికి మండలంలోని 44 మంది రేషన్‌డీలర్లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ప్రమాద భరితంగా రోడ్లు



ప్రక్కిలంక వద్ద ఏటిగట్టు వద్ద ఆర్ అండ్‌బీ రోడ్డుపై చేరిన ఇసుక



ప్రక్కిలంక నుంచి తాళ్లపూడి వెళ్లే రోడ్డు పై చేరిన ఇసుక

తాళ్లపూడి: ఇసుక రవాణా చేసే వాహనాల నుంచి రోడ్డుపై పడిన ఇసుక ప్రమాద భరితంగా మారుతోంది. వాహన దారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మండలంలోని పలుచోట్ల ఆర్అండ్‌బీ రోడ్ల పైకి చేరిన ఇసుకతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కొద్ది రోజులుగా గోదావరి ఏటిగట్టు రోడ్డు పై నుంచి అధిక సంఖ్యలో వెళుతున్న ఇసుక లారీలు, ట్రాక్టర్ల నుంచి కిందికి జారిపోయిన ఇసుక ఆర్ అండ్ బీ రోడ్డు పై పేరుకుపోయి స్పీడ్‌గా వెళ్లే వాహనాలు అదుపు తప్పుతున్న పరిస్థితి నెలకొంది. అధిక లోడుతో వెళుతున్న లారీలు, ట్రాక్టర్ల నుంచి ఇసుక రోడ్డు పై పడుతోంది. నిబంధనల మేరకు ఇసుక లోడుతో వెళ్లే వాహనాలపై టార్పాలిన్ కప్పాలి. టార్పాలిన్ లేకుండా ఇసుక రవాణా జరుగుతోంది. ముఖ్యంగా బల్లిపాడు ఓపెన్ రీచ్ దగ్గరలో, తాళ్లపూడి శివారు చిడిపి గ్రామం సమీపంలోని మలుపు వద్ద , ప్రక్కిలంక ఏటిగట్టు వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఇసుకు పడిపోయి ఉంది. ఈ ఇసుక వల్ల గట్టు పై నుంచి మలుపు తిరిగేటప్పుడు వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహన దారులు బ్రేక్ వేస్తే జారి పడుతున్నారు. రాత్రి సమయంలో అయితే మరింత ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఇసుక తొలగింపు చర్యలు చేపట్టి, ప్రమాదాల నివారణకు చొరవ తీసుకోవాల్సి ఉంది.

కోకో ధర స్థిరీకరణకు జోన్లు



కోకో రైతులతో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి సుజాతకుమారి

నల్లజర్ల: కోకో పంట ధర స్థిరీకరణకు ఫ్యాక్టరీలకు జోన్లు ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా ఉద్యానశాఖాధికారి బి.సుజాతకుమారి వెల్లడించారు. మంగళవారం నల్లజర్ల మండలంలో సింరాజుపాలెం, ఆవపాడు, ప్రకాశరావుపాలెం గ్రామాలలో ఆమె పర్యటించి కోకో రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా కోకో గింజలను కంపెనీలు తక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల తాము తీవ్రంగా నష్ట పోతున్నట్టు రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కంపెనీల మాయాజాలం వల్ల తాము ఏవిధంగా నష్టపోతున్నామో పలువురు కోకో రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో గింజలు రూ.700 ఉంటే రాష్ట్రంలో కంపెనీలు మాత్రం కిలో రూ.550,600కు మాత్రమే కొనుగోలు చేస్తున్నాయన్నారు. గ్రేడింగ్ పేరిట అడ్డగోలుగా ధర తగ్గించడం వల్ల రైతులు నష్టపోతున్నట్టు వివరించారు. వర్షాకాల పంట (అన్ సీజన్) కోకో గింజలను కంపెనీలు కొనుగోలు చేయడం లేదని, ఫలితంగా రైతుల వద్ద పెద్ద ఎత్తున నిల్వలు పేరుకుపోతున్నాయన్నారు. కంపెనీలు తగిన ధర ఇవ్వకపోతే వ్యత్యాసపు ధరను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. దీనిపై ఉద్యానశాఖాధికారి మాట్లాడుతూ ఆయిల్ పామ్ తరహాలో కంపెనీలకు జోన్లు విధానం అమలు చేయనున్నట్టు చెప్పారు. సోలార్ డ్రయ్యర్స్, పాలీటన్నెల్స్, బరకాలు, ప్లాస్టిక్ క్రేట్స్, యంత్ర పరికరాలు అందిస్తే నాణ్యతతో కూడిన గింజలు అందిస్తామని రైతులు వివరించారు. మండల ఉద్యానశాఖ అధికారి యం.బబిత, సాంకేతిక ఉద్యాన అధికారి పి.అమర్నాథ్, ఉద్యాన సహాయకులు బాల, పూర్ణిమ, మాండలేజ్ కంపెనీ ప్రతినిధి మనోజ్ పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్లకు అధనపు సాయం

ఉండ్రాజవరం: అందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనపు ఆర్థిక సహాయం అందించనున్నట్లు మండల హౌసింగ్ సహాయ ఇంజినీర్ బి.ఏడుకొండలు తెలిపారు. మండలంలో వేలివెన్ను గ్రామంలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 454 మంది గృహ లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టవలసి ఉందన్నారు. 163 మందిని నేరుగా కలిశామన్నారు. వారిలో ఇంటి నిర్మాణం కోసం 117 మంది లబ్ధిదారులు ఆసక్తి చూపినట్లు తెలిపారు. మే నెలాఖరు నాటికి ఇంటి నిర్మాణం పూర్తి చేసేలా వారికి అవగాహన కల్పించినట్లు వివరించారు.

రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలి



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న సివిల్ సప్లయిస్ డీటీ సత్యనారాయణ

నల్లజర్ల: రేషన్ కార్డులో ఉన్న సభ్యులంతా ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని తద్వారా త్వరలో ప్రభుత్వం అందించే స్మార్ట్‌కార్డు పొందే అవకాశం ఉందని సివిల్ సప్లయి డిటీ సత్యనారాయణ రాజు వెల్లడించారు. మంగళవారం నల్లజర్ల తహసీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండియూ ఆపరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. డీలర్లు ఈకేవైసీ ఏవిధంగా చేయించాలో అవగాహన కలిగించారు. మండలవ్యాప్తంగా 7,720 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. బుధవారం నుంచి శనివారం వరకు రేషన్ షాపుల వద్ద ఈకేవైసీ కార్యక్రమం జరుగుతుందన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం



విలేకర్లతో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి

దేవరపల్లి: స్వయం ఉపాధి పథకంలో మంజూరైన యూనిట్లకు బీసీ, కాపు కార్పొరేషన్, జనరల్ కేటగిరి (ఓసీ) అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలానికి 73 యూనిట్లు మంజూరైనట్టు తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 28 యూనిట్లు, కాపు కార్పొరేషన్ ద్వారా 38 యూనిట్లు, జనరల్ కేటగిరిలో 7 యూనిట్లు మంజూరైనట్టు తెలిపారు. యూనిట్ విలువలో 50 శాతం రాయితీ ఉంటుందని చెప్పారు. యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రు.5 లక్షల వరకు ఉంటుందన్నారు. 18 నుంచి 60 ఏళ్ల వయస్సు గలవారు అర్హులని తెలిపారు. ఈ నెల 22వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పారు. కుల ధ్రువీకరణ పత్రం జత పర్చాలని చెప్పారు. మహిళలకు 168 కుట్టుమెషీన్లు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీలకు 67, కాపులకు 38, కమ్మ సామాజికవర్గానికి 15, రెడ్డి సామాజికవర్గానికి 14, ఆర్యవైశ్యులకు 8, బ్రాహ్మణులకు 11,క్షత్రియులకు 7, ఈబీసీలకు 8 మెషీన్లు మంజూరైనట్టు తెలిపారు. ఎంపికైన మహిళలకు 45 రోజులు, 60 రోజులు, 90 రోజులు ఉచితంగా శిక్షణ ఇచ్చి అనంతరం కుట్టుమెషీన్లు అందజేస్తామని చెప్పారు. వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మండల పరిషత్ ప్రత్యేక అధికారి ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల పెంపుదల



నిడదవోలు వద్ద పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు: విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు మంగళవారం సాగు నీటి విడుదలను పెంచారు. గోదావరి పశ్చిమడెల్టా పరిధిలో రైతుల సాగునీటి అవసరాల మేరకు జల వనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు నీటి విడుదలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తున్నారు. దీనిలో భాగంగా పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కులు, తూర్పుడెల్టాకు 3,200, సెంట్రల్ డెల్టాకు 2,000 క్యూసెక్కులు వదులుతున్నారు. పశ్చిమడెల్టా పరిధిలో నరసాపురం కాలువకు అత్యధికంగా 1,912 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఏలూరు కాలువలకు 909 క్యూసెక్కులు, తణుకు కాలువకు 1,332 క్యూసెక్కులు, అత్తిలి కాలువలకు 465 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

డయేరియా అదుపులో ఉంది

ఆర్‌డీఓ రాణిసుస్మిత



గోపాలపురంలో క్లోరినేషన్ ట్యాంకును పరిశీలిస్తున్న ఆర్‌డీఓ రాణిసుస్మిత, తహసీల్దార్ అజయ్‌బాబు

గోపాలపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రబలిన అతిసార వ్యాధి అదుపులో ఉందని కొవ్వూరు ఆర్‌డీఓ రాణి సుస్మిత చెప్పారు. గోపాలపురంలో గల సత్యసాయి మంచినీటి సరఫరా విభాగాన్ని సోమవారం రాత్రి ఆమె సందర్శించారు. తాగునీటి వల్ల డయేరియా వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారన్న దానిలో వాస్తవం లేదన్నారు. వాతావరణం కాలుష్య ప్రభావం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యారని ఆమె తెలిపారు. సోమవారం రాత్రి 11 గంటలకు గోపాలపురం, చిట్యాల గ్రామాల నుంచి నలుగురు డయేరియా కేసులు నమోదు అయ్యాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ చైతన్యరాజు తెలిపారు. మంగళవారం కొత్త కేసులు నమోదు కాలేదని అన్నారు. గ్రామాల్లో 10 వైద్య శిబిరాలు, 20 మొబైల్ సిబ్బంది ఇంటింటా సర్వే చేస్తున్నట్లు చెప్పారు. డయేరియా సోకిన గ్రామాల్లో వారం రోజులపాటు వైద్య శిబిరాలు కొనసాగిస్తామని తెలిపారు.

దాళ్వా వరి పంట ఆశాజనకం



ధర్మవరం గ్రామంలో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

కొవ్వూరు: మార్టేరు పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం రాజమహేంద్రవరం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, కళాశాల విద్యార్థులు మంగళవారం ధర్మవరంలో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. దాళ్వా వరి పంట పరిస్థితి, వివిధ రకాల వంగడాల పనితీరు, చీడ పీడల ఉధృతి వంటి విషయాల అధ్యయనంలో భాగంగా క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టారు. చిరు సంచుల ప్రదర్శనలో భాగంగా సాగు చేస్తున్న ఎంటీయూ 1426, ఎస్ఎల్ఆర్ 3238 రకాల పనితీరు పరిశీలించినట్లు ఏరువాక కో-ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. డాక్టర్ గిరిజారాణి మాట్లాడుతూ నూతన చిరుసంచి రకం ఎంటీయూ 1426 పనితీరు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో బాగుందన్నారు. మొక్క ఎత్తు, పిలకల సంఖ్య, కంకి నిచ్చే పిలకల సంఖ్య, కంకిలో గింజల సంఖ్య ఆర్ఎస్ఆర్ 15408తో పోల్చితే మేలైనదన్నారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మరో రకం ఎస్ఎల్ఆర్ 3238 కుడా ఎంటీయూ1121కు ప్రత్యామ్నాయంగా గోదావరి జిల్లాల్లో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కంకిలో గింజల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ చీడపీడలు లేవన్నారు. కోత అయ్యాక ఫలితాలను విశ్లేషిస్తామని ప్రకటించారు. రాజమహేంద్రవరం ఏరువాక కో-ఆర్డినేటర్ డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ దాళ్వా పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా వరిలో కంకినల్లి ఆశించే అవకాశం ఉందన్నారు. రైతులు ఈ తెగులును గుర్తిస్తే స్పైరో మెసిఫిన్ 200 మిల్లీలీటర్లు ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. డాక్టర్ వి.భువనేశ్వరి, వ్యవసాయ శాఖ ఏడీఏ పి.చంద్రశేఖర్,ఏవో ఎ.గంగాధర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉండ్రాజవరం: పాలంగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా ట్రీ కటింగ్ పనుల కోసం మండలంలో కె.సావరం గ్రామంలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు మంగళవారం తెలిపారు.

పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

చాగల్లు: గ్రామంలో ఈ నెల 30 తేదీ వరకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేయనున్నట్లు కొవ్వూరు డివిజన్ ఉప సంచాలకులు డా.ఎస్.సత్యనారాయణ, సహాయ సంచాలకులు డాక్టర్ ఏ.వెంకటరెడ్డి తెలిపారు. మంగళశారం చాగల్లు పశు వైద్యశాల ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధుల నివారణ టీకాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ 4 నెలల వయస్సు దాటిన ప్రతీ పశువులకు టీకాలు వేయించాలన్నారు. కావున ఈ అవకాశాన్ని పాడి రైతులందరూ తప్పక వినియోగించుకోవాలని కోరారు. మండల ఉపాధ్యక్షులు జుజ్జువరపు రామచంద్రరావు, పాడి రైతులు, పశు వైద్యాధికారి డాక్టర్ యు.ముఖేష్, పశు సంవర్ధక సహాయకులు నాగేంద్రబాబు, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

పోతవరం, సుభద్రపాలెంలో పొలం పిలుస్తోంది

నల్లజర్ల: పోతవరం, సుభద్రపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని జాబితాలు రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శించామన్నారు. వాటిని రైతులు సరిచూసుకొని తేడాలుంటే వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలన్నారు. రైతులకు విశిష్ఠ గుర్తింపు సంఖ్య ప్రక్రియ ఇప్పుడు వేగంగా జరుగుతోంని ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే చేయించుకోవాలన్నారు. వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటున్నాయని రైతులు, రైతు కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న పొంట పొలాల్లో భూమిని కప్పి ఉంచే పంటలు జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి వాటిని సాగు చేయాలన్నారు.

పేదల కోసమే వైద్య శిబిరాలు

పెరవలి: లయన్స్ క్లబ్‌లు ఏర్పాటు చేసే వైద్య శిబిరాలు పేదల కోసమేనని వీటిని సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత ప్రజలదేనని లయన్స్ జిల్లా గవర్నర్ మాదిరెడ్డి బాబూజీరావు తెలిపారు. పెరవలి మండలం ముక్కామల గ్రామంలో మంగళవారం నిడదవోలుకి చెందిన రాజరాజేశ్వరి రమకృష్ణన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెల్ప్ ఏజ్ ఇండియా సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 62 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 12 మందికి కళ్లజోళ్లు అందజేశారు. 10 మందికి చికిత్సలు చేయాలని వైద్యులు నిర్ణయించారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కోలా సీతయ్యనాయుడు, సెక్రటరీ బి.రాజు, అరిగెల అరుణకుమారి, సలాది ఉదయ భాస్కరరావు, సీహెచ్ శ్రీనివాసరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న ఇద్దరి అరెస్ట్

దేవరపల్లి: నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లో మంగళవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో దేవరపల్లి మండలం దుద్దుకూరులో సారా అమ్ముతున్న వెలగన రామతులసిని అదుపులోకి తీసుకుని 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ బి. శ్రీనివాసరావు తెలిపారు. నల్లజర్ల మండలం పోతవరంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు ఆయన తెలిపారు. అక్రమ మద్యం అమ్మకాలు, సారా అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎస్సై ఏవీవీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.